క్లుప్తంగా

మహారుద్రాభిషేకం


శివలింగాలకు రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో ఉన్న ఓం సదనం ఆశ్రమంలో వైశాఖమాస మాసశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో 108 శివలింగాలకు మహారుద్రాభిషేకం నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేపాడలో పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో పంచాయతీ కార్యదర్శి గౌరీ నేతృత్వంలో పారిశుద్ధ్య పనులు బుధవారం నిర్వహించారు. వీధికాలువల్లో పేరుకుపోయిన చెత్తచెదారంతో పాటు కాలువలను ఆనుకుని పెరిగిన గడ్డిమొక్కలను తొలగించారు. ఇళ్లలోని చెత్తను వీధుల్లో వేయకుండా చెత్తబుట్టలో వేయాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఆటలతో ఆనందం


చిన్నారులతో ఆటలు ఆడిస్తున్న లైబ్రేరియన్ ఉషారాణి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా లైబ్రేరియన్ ఎం.ఉషారాణి విద్యార్థులకు క్యారంబోర్డు, లూడో, చెస్, తదితర గేమ్స్ ఆడించారు. విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పొందటానికి చదువుతో పాటుగా క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు నీటి పద్యాలు, వాటి తాత్పర్యాన్ని వివరించారు.

పచ్చదనం పరిశుభ్రత


కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం శ్రమదానం చేసి వాటిని తొలగించారు. కళాశాలల వెనుక వైపు విశాలమైన స్థలం ఉందని, దాన్ని శుభ్రం చేసి వివిధ రకాల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. స్థలాన్ని శుభ్రం చేసి కంటె ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

గజపతినగరం రూరల్: ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలుపుకుంటానని, వారి ఆకాంక్షకు అనుగుణంగా పనిచేస్తానని టీడీపీ ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన పత్రికా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇంతటి విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని, నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత
- కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం
- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం


చీపురుపల్లి: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత

చీపురుపల్లి: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని, అందుకనే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచాలని జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కోర్టు ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. పచ్చదనంతో స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందన్నారు. ప్రస్తుత అధిక ఉష్ణోగ్రతలకు పర్యావరణ సమతుల్యతే కారణమని, దీన్ని సరిదిద్దేందుకు మొక్కలు నాటాలని కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపాల్ మద్దలి వినోద్‌బాబు, సిబ్బంది మొక్కలు నాటారు. పర్యవరణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అదే విధంగా పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు రెడ్డి రమణ జీవీఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

నాటిన ప్రతీ మొక్కనూ కాపాడుకుందాం..

గజపతినగరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.సాయిసురేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. నాటిన మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ సెక్రటరి పొట్నూరు శ్రీను, జాయింట్ సెక్రటరి జెర్రిపోతుల జగదీష్, న్యాయవాదులు లెంక రాంబాబు, కె.సాయిశేఖర్, శీర వాసు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

శృంగవరపుకోట: పుణ్యగిరిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు, ఎన్ఎస్ఎస్ పీఓ జి.ఈరన్న, అధ్యాపకులు ఆర్.శ్రీలక్ష్మి, కె.భాస్కరరావు, విద్యార్థులతో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. పర్యావరణలో భాగమైన అడవులు, నదులు, పర్వతాలు, సరస్సుల్ని నాశనం చేస్తే మానవాళికి ముప్పు తప్పదన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో..

పట్టణంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మెంబర్ డి.సూర్యారావు, ఎ.మల్లేశ్వరరావు, జోగారావు మాస్టార్, వి.మల్లేశ్వరరావు, పి.వి.రమణ, డి.మేఘన, లోకేష్ తదితరులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటిచెప్పారు.

కోర్టు ఆవరణలో..

స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి ఆదేశాల మేరకు న్యాయవాదులు మొక్కలు నాటారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, సూపరింటిండెంట్ వి.సంపత్‌కుమార్, బార్‌అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ, న్యాయవాదులు ఆర్.సత్యనారాయణ, బి.రామకృష్ణ, బి.వి.ఎస్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.


చీపురుపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ వినోద్‌బాబు

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని కొండపాలెం, తాటిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, వెటర్నరీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. కాలుష్యం, ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ఏ విధంగా నష్టం జరుగుతుందో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు పి.రామారావు, డి.అప్పన్న, వెటర్నరీ కళాశాల డీన్ మక్కేన శ్రీను, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకుందాం..

వేపాడ: స్థానిక ఆదర్శ పాఠశాల, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. సోంపురంలో హెచ్ఎం బీవీఏ రాజు నేతృత్వంలో ఎకో యూత్ క్లబ్(నేషనల్ గ్రీన్ కార్ప్స్), భారత్ స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం, పచ్చదనం, పరిశుభ్రత, తదితర అంశాలపై విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ బాలభాస్కరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రవిశంకర్, వి.జగన్నాథం, తదదితరులు మొక్కలు నాటారు.


చీపురుపల్లి: ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, తదితరులు


గజపతినగరం: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న బార్‌అసోసియేషన్ సిబ్బంది

ఆదర్శ పాఠశాలలో..

పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు నేతృత్వంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను, మొక్కలు సంరక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నేటి మొక్కలే రేపటి మహా వృక్షాలు

లక్కవరపుకోట: నేడు మనం నాటే చిన్న చిన్న మొక్కలే రేపటి రోజున మహా వృక్షాలుగా ఎదిగి భవిష్యత్ తరాల మనుగడకు సహకరిస్తాయని ఎంఈఓ సీహెచ్.కూర్మారావు అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కేజీబీవీ పాఠశాల ఆవరణలో బుధవారం వివిధ రకాల మొక్కలు నాటారు. అలాగే జమ్మాదేవిపేట సమీపంలోని మహాత్మా జ్యోతీబాపూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో ఆధ్వర్యంలో సిబ్బంది పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈఓ కూర్మారావు మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత మొక్కలు, చెట్ల వల్లే సాధ్యమని, కాబట్టి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 జి.శ్రీనివాసరావు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్.కోట: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయవాదులు


ఎస్.కోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు



ఎస్.కోట: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్లు


లక్కవరపుకోట: కేజీబీవీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంఈఓ కూర్మారావు, తదితరులు


లక్కవరపుకోట: జమ్మాదేవిపేట బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న పాఠశాల సిబ్బంది


చీపురుపల్లి రూరల్: కొండపాలెం హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు


చీపురుపల్లి రూరల్: పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తాటిగూడ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు


వేపాడ: సోంపురంలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


వేపాడ: వేపాడ ఆదర్శ పాఠశాలలో పర్యావరణ సంరక్షణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రెండుపూటలా పనులు చేయాలి


ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఏపీఓ

- ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్

మెరకముడిదాం: ఉపాధి వేతనదారులు రెండు పూటలా పనులు చేయాలని ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని భీమవరంలో చెల్లయ్య చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. 194 మంది వేతనదారులు పనులకు హాజరైనట్లు గుర్తించి, వారి మస్తర్లను తనిఖీ చేశారు. ఫారం పాండ్‌లు తవ్వే సమయంలో నిర్దేశిత కొలతలు పాటించాలన్నారు.

తోటల గట్లు వేసినపుడు గట్లు పొడవు, వెడల్పుల కొలతలు తీసుకోవాలన్నారు. జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు హాజరుకావాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం టెండ్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని క్షేత్రసహాయకుడు సత్యనారాయణకు సూచించారు.

మోదీ పాలనపై విశ్వాసంతో మరోసారి పట్టం


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గజపతినగరం రూరల్: వరుసగా మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తున్న మోదీ నేతృత్వంలో దేశం మరింత అభివృద్ధి చెందుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు దేవర ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో అనేక సంస్కరణలు అమలు చేసిందన్నారు. మోదీ పాలనపై ప్రజలు మరింత విశ్వాసాన్ని ఉంచి మరోసారి బీజేపీకే పట్టం కట్టారన్నారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద మిఠాయిలు పంపిపెట్టారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఏడుకొండలు, దుర్గాప్రసాద్, భారతి, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

విజయనగరం రూరల్: విజయనగరం శాసన సభ్యురాలిగా ఎన్నికైన పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుకు టీడీపీ పార్టీ శ్రేణులు, అధికారులు అభినందనలు తెలియజేశారు. బుధవారం స్థానిక అశోక్ బంగ్లాలో అదితిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పలుచోట్ల భారీ వర్షం


లక్కవరపుకోట: చందులూరు సమీపంలో కురుస్తున్న వర్షం


వేపాడ: వేపాడలో రోడ్డుపై చేరిన వరదనీరు


గజపతినగరం: వర్షంలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

లక్కవరపుకోట/కొత్తవలస/దత్తిరాజేరు/వేపాడ/గజపతినగరం: వేసవి ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు బుధవారం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం లభించింది. కొత్తవలస, లక్కవరపుకోట, దత్తిరాజేరు, వేపాడ, గజపతినగరం మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు వర్షం కురవడంతో వరదనీరు పొంగిపొర్లింది. కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం ఖరీఫ్ పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడుంతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఉక్కపోత నుంచి ప్రజలకు ఊరట లభించింది.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం..

- విత్తనాలు, ఎరువులకు ప్రతిపాదనలు చేసిన వ్యవసాయశాఖ
- ఆర్‌బీకేలకు చేరుకున్న జీలుగు, కట్టిజనుము విత్తనాలు


చొదవాడ ఆర్‌బీకేలో పంపిణీకి సిద్ధంగా ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

పూసపాటిరేగ : ఖరీఫ్ సాగుకు వ్యవసాయశాఖ సన్నద్ధమైంది. ఈ ఏడాది జూన్ నెల మొదటి వారం నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. కొద్దిరోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం కూడా అనుకూలంగా మారింది. రైతుభరోసా కేంద్రాల పరిధిలో ఉన్న విస్తీర్ణం మేరకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు మంజూరుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి నివేదించినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. పూసపాటిరేగ మండలంలో ఖరీఫ్ సీజన్‌కు గాను వరిలో ఎంటటీయూ 1121 రకం 60 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 60 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం 25 క్వింటాళ్లు, తట్టిలు రకం 42 క్వింటాళ్లకు ప్రతిపాదనలు చేసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల నాలుగు మండలాల్లో ఖరీఫ్‌లో సుమారు 10 వేల ఎకరాలలో రైతులు వరిని సాగుచేస్తారు. ప్రస్తుతం రైతులు వరి నారుమళ్ల తయారీకి దుక్కులు చేపడుతున్నారు. అలాగే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన పెట్టుబడులను సిద్ధం చేసుకుంటున్నారు. కొంతమంది రైతులు భూసారానికి గాను పొలాల్లో పచ్చిరొట్ట పైరులను సాగు చేస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించిన విత్తనాలను సబ్సిడీపై వ్యవసాయశాఖ అందిస్తోంది. ఇదిలా ఉంటే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం



రాయితీపై జీలుగు, పిల్లిపెసర, కట్టి జనుము విత్తనాలు వ్యవసాయశాఖ ద్వారా సరఫరా అయ్యాయి. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలను రైతుభరోసా కేంద్రాలకు పంపించాం. పచ్చిరొట్ట సాగుతో భూమి భౌతిక స్వరూపం మెరుగుపడడంతో రైతులకు లాభం చేకూరుతుంది. మండలానికి సరిపడా వరి విత్తనాలకు ఇప్పటికే ఇండెంట్ పెట్టాం.

– కొల్లి నీలిమ, ఏఓ, పూసపాటిరేగ

నవధాన్యాల సాగుతో భూసారం

విజయనగరం ఫోర్ట్: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం విభాగం రీజనల్ లీడర్ ప్రకాష్ అన్నారు. జొన్నవలసలో రైతులకు బుధవారం నవధాన్యాల కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి పంట సాగు చేయడానికి ముందు నవధాన్యాల సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఉమామహేశ్వరావు, మహేష్, పాల్గొన్నారు.

నవధాన్యాలతో నేలకు మేలు..

డెంకాడ: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయాధికారి కె.ప్రకాశరావు అన్నారు. మండలంలోని అమకాం రైతుభరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి, రైతులకు పీడీఎంఎస్ కిట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూసారం పెరుగుతుందన్నారు. ఏఓ పూడి నిర్మల మాట్లాడుతూ.. త్వరలో వరి విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రశాంతి, వీఏఏ బి.విజయ్‌కుమార్, ఆర్‌డీ కావ్య, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.